క్లుప్తంగా

ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని గ్రామ సచివాలయంలో ఈనెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు, తిరిగి 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఒంటిమిట్ట ఇన్‌చార్జి ఎంపీడీఓ కుళ్లాయిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో అప్లికేషన్ వెరిఫై చేసేందుకు డిజిటల్ అసిస్టెంటును వెరిఫికేషన్ అధికారిగా, ఆయా సచివాలయాల మహిళా పోలీసులను సహాయకురాలుగా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులో పుట్టిన పిల్లల దగ్గర నుంచి ఐదేళ్ల పిల్లల వరకు నూతన ఆధార్ కార్డు నమోదు, అడ్రస్సు, ఫొటో, ఫోన్ నెంబర్, వేలి ముద్రల అప్‌డేట్ చేయబడుతుందని తెలియజేశారు. ఆధార్ ప్రత్యేక క్యాంపులు జరుగుతున్నట్లు ఆయా పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు సూచించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు



మంత్రి సత్యకుమార్‌ను కలసిన బీజేపీ నేతలు

రాయచోటి టౌన్ : రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు రాయచోటి బీజేపీ నాయకులు కలసి పలు సమస్యలను చర్చించినట్లు డాక్టర్ పాలగిరి శ్రీనివాస కుమార్ రాజు తెలిపారు. బుధవారం కడపకు వచ్చిన సందర్భంగా ఆయన్ను కలిసి రాయచోటిలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి ట్రామా కేర్ సెంటర్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో రేవన శ్రీనివాస రాజు, లోకేష్ వర్మలు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి నందలూరు సమస్యలు

నందలూరు : రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌ను బుధవారం కడప పట్టణంలో కలిసి మండలంలోని పలు సమస్యలపై విన్నవించినట్టు బీజేపీ నాయకులు పోతురాజు మస్తానయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా మస్తాన్యయ మాట్లాడుతూ శ్రీ మారమ్మ తల్లి దేవస్థానం సమస్యను వివరించగా మంత్రి వెంటనే సమస్యపై స్పందించి దేవస్థానానికి ఎటువంటి సమస్య లేకుండా చూస్తానని అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్‌తో మాట్లాడారు. మంత్రిని జాతరకు ఆహ్వానించగా ఆయన తప్పకుండా జాతరకు వస్తానని తెలియజేసినట్టు వారు చెప్పారు.

సీహెచ్‌ఎస్‌లో ఓఆర్‌ఎస్ కార్నర్ ఏర్పాటు



ఓఆర్‌ఎస్‌ను అందజేస్తున్న డాక్టర్ ప్రకాష్

సిద్దవటం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌ఎస్)లో ఓఆర్‌ఎస్ కార్నర్‌ను ఏర్పాటు చేశామని ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఓఆర్‌ఎస్ కార్నర్‌లో ఎవరి అనుమతులు లేకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లును తీసుకోవచ్చన్నారు. కార్నర్‌లో జింక్, మాత్రలు, వాంతులు, విరేచనాలు మాత్రలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ వారి ఆదేశాల మేరకు ఆసుపత్రి లోని క్యాజువాలిటీలో అత్యవసరంగా నాలుగు బెడ్లను వడదెబ్బ తగిలిన వారికి కేటాయించినట్టు తెలియజేశారు. ఆసుపత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్‌ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి ప్రోత్సాహం

వీరబల్లి : తాటికుంటపల్లి గ్రామ పంచాయతీలోని మట్లి రెడ్డివారిపల్లికి చెందిన పల్లం చైత్ర అనే విద్యార్థిని నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక అయ్యిందన్నారు. చైత్రకు రెడ్డివారిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి రీడింగ్ చైర్, ప్యాడ్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ చైత్ర అనే విద్యార్థిని తమ పాఠశాలలో ఐదవ తరగతి వరకు చదివి అనంతరం మట్లి పెద్దూరులోని హైస్కూల్‌లో చదువుతూ ఈ పరీక్ష రాసి ఎంపిక కావడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా బుధవారం సాయంత్రం అంకురార్పణ కార్యక్రమాలు వైభవంగా ప్రారంభించారు. ఉదయం సుప్రభాతసేవ, కలశస్థాపన చేసి అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం గజవాహన సేవతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు 9 రోజుల పాటు టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి



సిద్దవటం: ఉపాధ్యాయుడు బాలరాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం



నందలూరు: డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సిద్దవటం : ప్రభుత్వం ఉద్యోగంలో చేరిన ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ అనేది తప్పనిసరి అని సిద్దవటం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీరాములు తెలిపారు. మండల కేంద్రంలోని పాఠశాలలో స్కూల్ అసిస్టెంటు/పీజీటీ కెమిస్ట్రీ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత బాలరాజు రామలింగరాజుకు బుధవారం పదవీ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు రామలింగరాజు పాఠశాల లోని విద్యార్థులకు చదువు విషయంలో క్రమశిక్షణలో చేసిన సేవలు మరువలేనివన్నారు. గత ఏడాది 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఆయన చేసిన కృషి చేశారని కొనియాడారు. అనంతరం బాలరాజు రామలింగరాజు దంపతులను పూల మాలలతో శాలువాలు కప్పి మెమెంటోలను ఇచ్చి ఘనంగా సన్మానం చేశారు.

డాక్టర్ నాగేంద్ర ప్రసాద్‌కు ఘన సన్మానం

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి బాలికల జూనియర్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకులుగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన డాక్టర్ మీసరగండ నాగేంద్ర ప్రసాద్ బుధవారం ఘన సన్మానం అందుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయలలిత కుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు నాగేంద్ర ప్రసాద్, శ్రీదేవి దంపతులను శాలువా, గజమాలలు, జ్ఞాపికలు, పంచరత్న పద్యాలతో సత్కరించారు.

జిల్లా కోర్టు సూపరింటెండెంట్‌గా చల్లా సేవలు ప్రశంసనీయం

కడప జిల్లా కోర్టు సూపరింటెండెంట్‌గా పనిచేసిన చల్లా గంగాధర శివయ్యకు బుధవారం ఘనంగా పదవీ విరమణ వీడ్కోలు పలికారు. స్థానిక పాత ఆర్‌అండ్‌బీ రోడ్డులోని ఆయన స్వగృహంలో కుటుంబసమేతంగా పదవీ విరమణ సన్మాన సభ



నందలూరు: శివయ్యను సన్మానిస్తున్న దృశ్యం

నిర్వహించారు. ఈ సందర్భంగా సమతా సైనిక్ దళ్ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు చౌడవరం సుబ్బనరసయ్య, నందలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహులు, మండల ఉపాధ్యక్షుడు నాయనపల్లె అనుదీప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు సూపరింటెండెంట్ చల్లా గంగాధర శివయ్య సేవలు ప్రశంసనీయమని పలువురు కొనియాడారు.

ఉజ్వల భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలి

ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే



మాట్లాడుతున్న ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే

రాజంపేట టౌన్ : విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు ఆస్వాదించే దిశగా అడుగులు వేయాలని ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం అధ్యక్షతన జరిగిన కళాశాల వార్షికోత్సవ వేడుకకు ఏఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డిగ్రీ చదివే విద్యార్థులకు జీవితంలో స్థిరపడే సమయం ఆసన్నమైందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో విద్యార్థుల ఆలోచన విధానం వేరని, అయితే డిగ్రీ చదివే విద్యార్థుల ఆలోచన విధానం ఆ విధంగా ఉండకూడదన్నారు. డిగ్రీ తరువాత ఎంబీఏ, ఎంసీఏ, పీజీ వంటి కోర్సుల్లో సీటు సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో విధిగా ఉన్నత విద్య అభ్యసించాల్సిన అవసరం ఉందన్నారు. పీజీ తరువాత తల్లిదండ్రులపై ఆధారపడకుండా స్వశక్తితో జీవించేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకొని ఆ దిశగా అడుగులు వేయాలని తెలిపారు. చాలా మంది సివిల్స్ విజయం సాధించడం చాలా కష్టమని ఆ దిశగా ఆలోచించరన్నారు. అయితే సాధించాలన్న పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలరన్న విషయాన్ని విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఇదిలావుంటే విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం, చెక్కభజన, శాస్త్రీయ నృత్యాలు, కృష్ణార్జున సంవాద నాటకం వంటి సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం, వైస్ ప్రిన్సిపల్ కె.వెంకటనరసయ్య, రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎన్.శ్రీరాములునాయుడు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ బాసినేని వేణుగోపాల్ నాయుడు, మహిళా సాధికారిత విభాగం అధికారిణి పార్వతి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తాం



మృతుని కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి లక్ష రూపాయలు చెక్కును జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అందజేశారు. రాజంపేట డివిజన్ పరిధిలోని పెనగలూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ హెడ్ కానిస్టేబుల్ (404) నీరుకట్ల గురుమూర్తి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో మృతుని సతీమణి అమరావతికి ఐడీఆర్‌ఎఫ్ ఫండ్ నుంచి లక్ష రూపాయలు చెక్కును ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ సతీమణి, వారి కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖలో అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. అటువంటి వారి కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చూస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ బి.కృష్ణుడు, మృతుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిరసనతో కదిలిన ఆర్‌డబ్ల్యూఎస్ యంత్రాంగం



సమస్యను తెలియజేస్తున్న మహిళలు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని దప్పేపల్లి గ్రామం కొండవాండ్లపల్లిలో సీపీఐ నాయకుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపిన సంఘటన 'సాక్షి'లో బుధవారం సంచికలో ప్రచురితమైంది. కథనానికి స్పందించిన బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్య, ఏఈ కిషోర్ కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఉషారాణితోపాటు పంచాయతీ సిబ్బంది స్థానిక టీడీపీ నాయకులు కలిసి కొండావాండ్లపల్లిలో తాగునీటి సమస్యపై మహిళలతో కలిసి ఆరా తీశారు. అధికారులు మాట్లాడుతూ మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి కొత్తబోరు వేయించే ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ఒంటిమిట్ట చెరువును సోమశిల జలాలతో నింపాలి



చెరువును పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకుడు సుబ్బారెడ్డి తదితరులు

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని చెరువును సోమశిల జలాలతో నింపి రైతులను ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఎం.వి.సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఒంటిమిట్ట చెరువును, ఒంటిమిట్ట చెరువు ఆయుకట్టుదారుల సంఘం వైస్ చైర్మన్ యానాదయ్యతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది 8 సంవత్సరాల నుంచి సోమశిల వెనుక జలాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ఒంటి మిట్ట చెరువుకు నీరు తీసుకురావాలని అనేక మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఎత్తిపోత పథకంలో నాసిరకం పనుల వల్ల గత 7, 8 సంవత్సరాల కాలంలో దాదాపు 10 సార్లు పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడం అత్యంత బాధాకరమన్నారు. ఒంటిమిట్ట చెరువులో నీరు నింపడం ద్వారా చెరువు ఆయుకట్టు దాదాపు 1450 ఎకరాల రైతులు సాగు చేసుకునే అవకాశం కలగడంతో పాటు ఆరేడు గ్రామాలకు తాగునీరు కొరత లేకుండా ఉంటుందన్నారు. పరోక్షంగా భూగర్భ జాలలు పెరగడంతో పాటు బోర్ల ద్వారా 1000 ఎకరాలకు సాగునీరు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. అలానే ఒంటిమిట్టను కరువు మండలంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ఒంటిమిట్ట మండల తహసీల్దారు రమణమ్మకు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో శివ, వెంకటయ్య, ప్రసాద్‌బాబు, వెంకట్రామయ్య, నాగరాజు, తులసిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

పక్కా గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలి

సిద్దవటం : మాధవరం-1, ఎస్‌కేఆర్ నగర్, పార్వతీపురం గ్రామాలలో 2019 – 20, 21 సంవత్సరాల్లో మంజూరైన పక్కా గృహాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని బుధవారం లబ్ధిదారులకు ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించామని హౌసింగ్ ఏఈ చెన్నయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు మంజూరైన పక్కా గృహాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అడిషనల్ అడ్వాన్స్ పేమెంట్ గృహ లబ్ధిదారులకు త్వరగా పనులు పూర్తి చేసుకునేందుకు ఒక్కొక్కరికి రూ. 50వేలు మంజూరు చేశామన్నారు. జూన్ మాసం లోపల ప్రతి ఒక్కరూ పక్కా గృహాల నిర్మాణ పనులను పూర్తి చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

భూ గర్భ జలాల వృద్ధికి కృషి



భూమి పూజ చేస్తున్న ఏపీఓ పెంచలయ్య

రామాపురం : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో పశువులకు దాహార్తించడానికి 39 నీటి తొట్లు మంజూరైట్లు ఉపాధి హామీ పథకం ఏపీఓ పెంచలయ్య తెలిపారు. మండలంలోని నీలకంఠ్రావుపేట, కసిరెడ్డిగారిపల్లె పంచాయతీలలోని కడవకూటివాండ్లపల్లె గ్రామంలో నీటి తొట్లకు ఈసీ శివయ్యతో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. మాట్లాడుతూ మండలానికి మంజూరైన నీటి తొట్లను ఈనెల 10వ తేదీలోపు నిర్మాణం పూర్తి చేయాలని డ్వామా పీడీ ఆదేశించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత వేసవి సీజన్‌లో పశువుల దాహార్తి తీర్చడానికి ప్రభుత్వం చేపట్టిందన్నారు. నీటి సంరక్షణ కోసం భూగర్భ జలాల వృద్ధి కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. సేద్యపు నీటి కుంటలో ఫారం పాండ్లు నిర్మించుకొని భూగర్భ జలాల వృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహబూబ్‌బాషా, తిమ్మారెడ్డి, చిట్టి రెడ్డయ్య, ధనుంజయ, నాగరాజు, నరహరి, సుబ్బరాయుడు, ధర్మయ్య, టెక్నికల్ అసిస్టెంట్ పెంచల్ రెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ప్రదర్శన

కడప కార్పొరేషన్ : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా క్రైస్తవులు బుధవారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక కాంగ్రిగేషనల్ టౌన్ చర్చిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ మోహన్‌బాబు మాట్లాడుతూ మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల కడప వాసి కావడం గర్వకారణమన్నారు. ఆయన కుటుంబానికి ఆదరణ కలగాలని దేవుని ప్రార్థించారు. ప్రభుత్వం కేసులోని వాస్తవాలను వెలికితీసి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ విజయుడు, నోవా బెన్ని, ఆశీర్వాదమ్మ, సుశీలమ్మ, రాజమనోహర్, ప్రసన్న కుమార్, పులి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

రూ.15.75 లక్షలు పలికిన సంత వేలంపాట



వేలంపాటను నిర్వహిస్తున్న అధికారులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని కూరగాయల సంత, పశువుల సంత 2025 – 26 సంవత్సరానికి సంబంధించిన వేలంపాటను బుధవారం సుండుపల్లె గ్రామ సచివాలయంలో ఇంచార్జ్ జిల్లా పంచాయతీ అధికారి మస్తాన్‌వలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయల సంతకు 18 మంది, పశువుల సంతకు 17 మంది వ్యక్తులు నగదు రూపంలో పంచాయతీ కార్యదర్శికి చెల్లించి రసీదులను తీసుకొని వేలంపాటలో పాల్గొన్నారు. కూరగాయల సంతను రూ.15.75 లక్షలకు రెడ్డిచర్ల వెంకటరమణ వేలంలో దక్కించుకున్నారు. అలాగే పశువుల సంతను రూ.6.45 లక్షలకు సుంకర నారాయణ వేలంపాటలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి సురేష్‌బాబు, పంచాయతీ సెక్రటరీ రామరాజు, రామచంద్ర, రామమోహన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

285 ఫారం పాండ్ల మంజూరు



ఉపాధి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

చిన్నమండెం : మండలంలో 285 ఫారం పాండ్ల పనులు పూర్తి చేసేలా కృషి చేయాలని ఎంపీడీఓ శివానాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రూ.300 వచ్చే విధంగా మేట్స్ మార్కింగ్ ఇచ్చి కూలీకు పనులు కల్పించాలని సూచించారు.

మాజీ సర్పంచ్ ఖాజామియా సేవలు మరువలేనివి



నాగులమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

రామాపురం : నీలకంఠ్రావుపేట మాజీ సర్పంచ్ ఖాజామియా సేవలు మరువలేనివని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంతరెడ్డి అన్నారు. రామాపురం మండలం నీలకంఠ్రావుపేట మాజీ సర్పంచ్ ఖాజామియా బుధవారం మృతిచెందారు. వారి మృతదేహాన్ని శ్రీకాంత్‌రెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఖాజామియాతో తనకున్న అనుబంధాన్ని శ్రీకాంత్‌రెడ్డి గుర్తుకు చేసుకుని దిగ్భ్రాంతికి గురయ్యారు. అతని మృతి పార్టీకి తీరనిలోటని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.

రాయచోటి జగదాంబసెంటర్ : వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నాయకులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ దశరథరామిరెడ్డి మాతృమూర్తి పాలంరెడ్డి నాగులమ్మ మృతదేహానికి వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి నివాళులర్పించారు. రాయచోటి పట్టణం ఎస్‌ఎన్ కాలనీలోని వారి నివాసంలో నాగులమ్మ మృతదేహాన్ని బుధవారం శ్రీకాంత్‌రెడ్డి సందర్శించారు. ఆమె మృతిపట్ల సంతాపం తెలిపి దశరథరామిరెడ్డిని వారి కుటుంబసభ్యులను పరామర్శించి ఆమె పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ సేట్ వెంకట్రామిరెడ్డి, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హరూన్, ఫయాజ్ అహమ్మద్, షబ్బీర్, ఇర్ఫాన్, కోఆప్షన్ సభ్యుడు అయ్యావారురెడ్డి, సుగవాసి శ్యామ్, సంబేపల్లె మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గ్రామం ఈడిగపల్లికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు తల్లి మరణించడంతో ఆమె మృతదేహానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డిలు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలానే మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ మురికినాటి రెడ్డయ్య, ఎంపీటీసీ జగన్ మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సభాపతి నాయుడు, శ్రీధర్, చంద్ర, ఓబులేసు, రమణయ్య, బాబ్‌జాన్ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కృష్ణా థియేటర్ వద్ద ఓ వ్యక్తి బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. చుట్టుపక్కల వారు మృతదేహాన్ని చూసి చిట్వేలి మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలి

పీలేరురూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌ఎంయూ జిల్లా కార్యదర్శి పి.ఎం.ఎస్. రాజు అన్నారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల పాటు ఎన్‌ఎంయూ నాయకులు రెడ్ బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 2019 సర్క్యులర్‌ను ఇచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నైట్‌అవుట్ అలవెన్సులు రూ. 400 ఇవ్వాలని కోరారు. హైయర్ పెన్షన్ సమస్యలు సత్వరం పరిష్కరించాలని, లీవు ఎన్‌క్యాష్‌మెంట్‌ను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఎలక్ట్రానిక్ బస్సులను ప్రభుత్వం, సంస్థగానీ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈహెచ్‌ఎస్ విధానంకు బదులు పాత వైద్యవిధానం అమలు చేయాలని కోరారు. ఎన్‌ఎంయూ నాయకులు సి.వి. రమణ, ఆదినారాయణ, హరినాథ, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 4న కళాశాల వార్షికోత్సవం

కడప ఎడ్యుకేషన్ : పట్టణంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏప్రిల్ 4వ తేదీన కళాశాల వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలను స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు స్టూడెంట్ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్య అతిథిగా కడప జిల్లా ఎస్పీ శ్రీ ఈజీ.అశోక్‌కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ హాజరవుతారని తెలిపారు. అత్యధిక మార్కులతో ప్రతిభ చూపిన విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీలో ఉత్తమ సేవలందించిన వారికి జ్ఞాపిక, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు.